www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 5 నవంబర్ 2025
5
తిరుపతి



ఎస్వీ గోశాలను పరిశీలించిన టీటీడీ ఈవో

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: తిరుపతి, శ్రీ వేంకటేశ్వర గోశాలను మంగళవారం టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ పరిశీలించారు. గోశాల నిర్వహణ, గోవులకు అందుతున్న దాణా, వసతి, వైద్యం, తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలను ఈవోకు ఇంచార్జీ డైరెక్టర్ డి.పణికుమార్ నాయుడు వివరించారు. దాదాపు 500 గోవులకు ఆధునిక వసతులతో నిర్మిస్తున్న సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ భవనాన్ని, గోశాలలో గోవులు, పెయ్య దూడలు ఉంటున్న షెడ్లను పరిశీలించారు. గోశాలలో పశువుల సంఖ్య, దాణా మిక్సింగ్ ప్లాంటు, అగరబత్తిల యూనిట్ వంటి కార్యకలాపాలను ఈవో పరిశీలించారు. గోశాల, అగరబత్తిల యూనిట్ లోని సిబ్బందితో ఈవో మాట్లాడారు.

తిరుమలలోని దుకాణాల్లో సాంప్రదాయ ఆహారం అందించాలి

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలోని దుకాణాల్లో భక్తులకు సాంప్రదాయ ఆహారాన్ని అందించేలా పటిష్టమైన ప్రణాళికను రూపొందించాలని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన శ్రీ పద్మావతి అతిథి భవనంలోని సమావేశ మందిరంలో పలు శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలలోని దుకాణదారులు భక్తులకు నాణ్యమైన, రుచికరమైన సాంప్రదాయ ఆహారాన్ని అందించేలా స్థిరమైన విధానాన్ని అమలు చేయాలన్నారు. తిరుమలలో పచ్చదనాన్ని అభివృద్ధి చేయడంతో పాటు జీవవైవిధ్యాన్ని పెంపొందించేలా ఏర్పాట్లు చేయాలని అటవీ అధికారులను ఆదేశించారు. దాతలతో తిరుమలలోని ఉద్యానవనాలను సుందరీకరించాలని సూచించారు. అనంతరం ఆరోగ్య విభాగం, ఎస్ ఎం ఎస్ సేవలు, తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో భక్తుల కోసం ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ బోర్డులు, శ్రీ వారి సేవ, వైద్య, ఐటీ, కళ్యాణ కట్ట విభాగాల పనితీరు, తదితర అంశాలను కూడా సమీక్షించారు. ఈ సమావేశంలో వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను అడ్డుకుందాం

- విద్యుత్ సంస్థను కాపాడుకుందాం
- రాష్ట్ర సదస్సులో జయశంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈఈ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు జయశంకర్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: కార్పొరేట్ శక్తులకు ప్రజల సొమ్మును అప్పనంగా దోచి పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణను అడ్డుకొని, సంస్థను కాపాడుకుందామని అఖిల భారత నాయకులు, ఈఈఈ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు జయశంకర్ పిలుపునిచ్చారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణ ఆపాలి, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలి అనే నినాదంతో ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సును మంగళవారం తిరుపతిలో నిర్వహించారు. స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో యుఈఈయు రాష్ట్ర అధ్యక్షులు సూరిబాబు అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మన దేశానికి రష్యా, కెనడా దేశాలు అటు పరిశ్రమల స్థాపనకు ఇటు సాంకేతిక అంశాల సహాయానికి దోహదపడ్డాయని గుర్తు చేశారు. ఎల్ఐసి దినదిన అభివృద్ధి చెందుతూ ప్రపంచంలోనే అత్యున్నత సంస్థగా ఎదిగిందని, అలాంటి సంస్థలో సైతం 25% పైగా ప్రైవేటు కన్నా చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పీవీ నరసింహారావు హయాంలో సరళీకరణ, సంస్కరణల పేరుతో ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు పూనుకోవడంతో ప్రభుత్వ సంస్థలు కనుమరుగయ్యే పరిస్థితి దాపురించిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణకు దారులు తెరవడంతో దోపిడీదారులు ప్రవేశించి ప్రభుత్వ సంస్థలను విచ్ఛిన్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దశల వారీగా ప్రైవేటీకరణలో భాగంగా స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చారని, నెట్ సెంటర్ల ఏర్పాటు, లైన్ల ఆధునీకరణ పనులను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడంతో భవిష్యత్తుల్లో విద్యుత్ వ్యవస్థ మొత్తం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి పోనుందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆదాని, అంబానీలను ప్రపంచ కుబేరులుగా చేయాలనే లక్ష్యంతోనే పనిచేస్తున్నారని ధ్వజమెత్తారు. సంఘటిత, అసంఘటిత కార్మికులు ఐక్యమై ఉద్యమాలు చేపట్టాలని, అందుకు ప్రతి ఒక్కరు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి విద్య, వ్యవసాయం, విద్యుత్ వంటి బలమైన ఆర్థిక రంగాలను కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసే కుట్ర చేసిందన్నారు. విద్య సంస్థల ప్రైవేటీకరణ ఆంధ్రప్రదేశ్ నుంచి మొదలైందని గుర్తు చేశారు. ప్రైవేటీకరణను అంగీకరించిన మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాలు విచ్ఛిన్నం అయ్యాయని గుర్తు చేశారు. అయినా రాష్ట్రంలోని కోటమీ ప్రభుత్వం మోడీ చెప్పింది వేగంగా ప్రైవేటు కన్నా వైపు అత్యంత వేగంగా అడుగులు వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని బిజెపి పాలిత రాష్ట్రాలు సైతం ప్రైవేటీకరణకు వెనకడుగు వేస్తుంటే ఏపీలో అందుకు భిన్నంగా ఉందన్నారు. దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేసి 13 గంటల పని విధానాన్ని తీసుకురావాలని కేంద్రంలో మోడీ చెప్పిన వెంటనే రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగమేఘాల మీద అమలు చేయడం బాధాకరమన్నారు. ఆంధ్రప్రదేశ్లోని విద్యుత్ రంగ సంస్థలు లక్షా 23 వేల కోట్ల రూపాయలు అప్పుల్లో కూరుకుపోయాయని ఇందుకు పాలకుల తీరే కారణమన్నారు. విద్యుత్ రంగం నష్టాలు కొరకు పోవడానికి ప్రధాన కారణం చంద్రబాబు నాయుడు అని, ఆ తర్వాత వచ్చిన పాలకులు కూడా వాటిని అనుసరించారని గుర్తు చేశారు. గత ప్రస్తుత పాలకులు సంస్కరణల పేరుతో దేశాన్ని సర్వనాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో దేశాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడే కునేందుకు మరో స్వాతంత్ర ఉద్యమం అవసరమని, రాజీలేని పోరాటాలకు కార్మికులందరూ సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈనెల 20వ తేదీ విజయవాడ కేంద్రంగా జరిగే భారీ పోరాటం, బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సదస్సులో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్ రెడ్డి, స్ట్రగుల్ కమిటీ కార్యదర్శి సుబ్బిరెడ్డి, ట్రబుల్స్ కమిటీ నాయకులు ముస్తాఫ్ అహ్మద్, ఎల్. రాజు, శివశంకర్, జాకీర్ హుస్సేన్, గంగయ్య, సుమన్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, నరసింహులు, శేఖర్, గిరిబాబు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌ను ప్రోత్సహించిన ప్రొ॥ విశ్వనాథ్ రెడ్డిని సస్పెండ్ చేయాలి

: విద్యార్థి సంఘాలు



ప్రజాశక్తి - క్యాంపస్ : ప్రజాశక్తి - క్యాంపస్ : జూనియర్ విద్యార్థులపై సీనియర్ల ర్యాగింగ్‌ను ప్రోత్సహించిన ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డిని రెండేళ్ల పాటు సస్పెండ్ చేయాలని, ర్యాగింగ్‌లో పాల్పడిన సీనియర్ విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అన్నమయ్య భవనం ఎదుట ఐక్య విద్యార్థి సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాయి. ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కన్వీనర్ అశోక్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఎస్వీయు కార్యదర్శి వినోద్, ఎన్ఎస్యూఐ రాష్ట్ర కార్యదర్శి జన్నే మల్లికార్జున, పిడిఎస్ఓ జిల్లా కార్యదర్శి ఆశ, జిఎన్ఎస్ ఫౌండర్ శివశంకర్ నాయక్, నెల్సా జాతీయ అధ్యక్షుడు సుందరరాజు, జేబీఎస్ఎఫ్ రాయలసీమ కన్వీనర్ భార్గవ్ సాయిలు మాట్లాడుతూ.. సోమవారం యూనివర్సిటీ అధికారులు ర్యాగింగ్‌లో పాల్పడిన విద్యార్థులను సస్పెండ్ చేయడం, అలాగే ర్యాగింగ్‌కు ప్రోత్సాహం ఇచ్చిన ప్రొఫెసర్ నుండి హెడ్‌షిప్‌ను తొలగించడం, విచారణ కమిటీ నియమించడం శుభపరిణామమన్నారు. అయితే, విచారణ కమిటీ నివేదిక పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, తరగతి గదుల్లోని సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలించి వాటి ఆధారంగా కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆ సీసీటీవీ ఫుటేజ్‌లను విద్యార్థి సంఘాల నాయకులకు చూపించాలని కోరారు. ఇకపై ఏ విభాగంలోనూ ఐసీ క్లాసులు నిర్వహించరాదని, దీనిపై వైస్ ఛాన్సలర్ తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. రేపు యూనివర్సిటీలో ర్యాగింగ్ కు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి నిరసన చేపడుతున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ విశ్వనాథరెడ్డి అక్రమాలు గతంలోనే బయటపడ్డాయని, 2022లో ప్రిన్సిపాల్‌గా ఉన్నప్పుడు మహిళా ఉద్యోగులను వేధించినందుకు ఆయనను తొలగించారన్నారు. అలాగే తన వద్ద పనిచేస్తున్న పీడీఎఫ్ స్కాలర్లకు ఫెలోషిప్ బిల్లులను పెట్టకుండా నిలిపివేశారని, ఆ స్కాలర్ ఫిర్యాదు లేఖ తమ వద్ద ఉందని తెలిపారు. పరిశోధక విద్యార్థులపై అసభ్య పదజాలంతో తిడుతూ గంటల తరబడి వారిని చాంబర్‌లో నిలబెట్టేవాడని విద్యార్థులు వాపోయారు. ఇలాంటి దుర్మార్గ ప్రొఫెసర్‌ను ఉద్యోగం నుండి పూర్తిగా తొలగించాలని ప్రభుత్వం, విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌ను విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. లేకపోతే పరిపాలన భవనం ముందు నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. మంగళవారం ర్యాగింగ్ కమిటీ విచారణ జరుగుతుండగా, గెస్ట్ ఫ్యాకల్టీ కే. విశ్వనాథ్ బాధిత విద్యార్థినులను "కాంప్రమైజ్ అవ్వండి" లేదా ఇక్కడ టీసీ తీసుకోవాలంటే రెండు లక్షలు కట్టాలని, వేరే చోట చదివే అవకాశం లేకుండా చేస్తామని బెదిరించినట్లు విద్యార్థినులు తెలిపాడంతో రౌండ్ టేబుల్‌లో ఉన్న విద్యార్థి నాయకులు నేరుగా సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ చాంబర్‌కు వెళ్లగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. విద్యార్థి సంఘాలు, పోలీసుల మధ్య వాదోపవాదాలు చోటు చేసుకోగా, వెస్ట్ సీఐ మురళీ మోహన్ జోక్యం చేసుకొని విద్యార్థులను శాంతింప చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ బాలాజీ, కుమార్,జెన్ కిరణ్, దేవేంద్ర లు పాల్గొన్నారు.

మంత్రి నారా లోకేష్ దృష్టికి..

ర్యాగింగ్ ఘటనపై రాష్ట్ర మంత్రి నారా లోకేష్ దృష్టి సారించారు. ఈ విషయాన్ని తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్ మంత్రికి వివరించారు. ర్యాగింగ్ తీరును, అందులో ప్రధానంగా ప్రస్తావించిన ఒక అధ్యాపకుడి వైఖరిని హేమంత్ రాయల్ మంత్రి లోకేష్‌కి నివేదించారు. ఈ ఘటనపై ఇప్పటికే పోలీస్ యంత్రాంగం దర్యాప్తు మొదలుపెట్టిందని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఘటనపై వివరాలు తెలుసుకున్న మంత్రి నారా లోకేష్ ర్యాగింగ్ భూతాన్ని తరిమికొట్టే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా విద్యార్థుల్లో అవగాహన పెంచే కార్యక్రమాలను నిర్వహించాలని హేమంత్ రాయల్‌కు ఆదేశించారు. ర్యాగింగ్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థులలో చైతన్యం తీసుకురావాలని మంత్రి లోకేష్ స్పష్టం చేసినట్లు తెలిసింది.

పోలీసుల పహారాలో విచారణ



ఎస్వీయులో సోమవారం మనోవిజ్ఞాన శాస్త్ర విభాగంలో జూనియర్ విద్యార్థులను సీనియర్ విద్యార్థులు తరగతి గదిలో ఇంట్రడక్షన్ క్లాస్ పేరుతో ర్యాగింగ్ చేశారని విభాగాధిపతికి ఫిర్యాదు చేస్తే ఆయన విద్యార్థినీలతో అసభ్యంగా ప్రవర్తించారని సమాచారం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నేతలు ఎస్వీయూ రెక్టార్ ఛాంబర్‌ను ముట్టడించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సోమవారం రాత్రి పదిన్నర గంటల వరకు రెక్టార్ ఆచార్య అప్పారావు చాంబర్లో రిజిస్ట్రర్ భూపతి నాయుడు సిడిసి డీన్ చెంద్రాయుడు, సైకాలజీ విభాగాధిపతి విశ్వనాథరెడ్డి, విద్యార్థినీలు, విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతల ఆధ్వర్యంలో డీఎస్పీ, పోలీసుల సమక్షంలో విచారణ జరిపి విభాగాధిపతిపై చర్యలు తీసుకునేందుకు కమిటీని ఏర్పాటు చేశారు. సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆఫీసులో వైస్ ప్రిన్సిపాల్ చైర్మన్‌గా, ఇతర సీనియర్ ఆధ్యాపకులు, ఒక మహిళా పోలీసు అధికారిని, మరొక పోలీసు అధికారి సమక్షంలో పూర్తిస్థాయి పోలీసు పహారాలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ రోడ్డును పూర్తిస్థాయిలో నిర్బంధించి కమిటీ విచారణ చేశారు. ఫిజిక్స్, జువాలజీ, కెమిస్ట్రీ, బోటనీ విభాగాలకు చెందిన బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పరిశోధకులు కాలేజీకి పోయేందుకు కూడా పోలీసులు అనుమతించకపోవడంతో మంగళవారం తరగతి గదులకు పోవాల్సిన విద్యార్థులు, సిబ్బంది అసహనం వ్యక్తం చేశారు. అంతేకాక, ఒకవైపు విద్యార్థినిలను మభ్యపెట్టే ధోరణిలో సైకాలజీ విభాగానికి చెందిన సీనియర్లు ప్రయత్నిస్తున్నారని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపించారు. ఒక విశ్వవిద్యాలయంలో ఇతర విభాగాలకు వెళ్లే విద్యార్థులకు, పరిశోధకులకు ఎటువంటి దారి అవకాశం కల్పించకుండా సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ దారిలో పోలీసులు పహారా నిర్వహించడం వర్సిటీలో 144 సెక్షన్ తలపించిందని విద్యార్థి సంఘాల నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

ఆదాయ వనరుల పెంపుకు చర్యలు చేపట్టండి

- తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తుడా పరిధిలో ఉండే మున్సిపల్ కమిషనర్లు ఎల్ఆర్ఎస్ బీపీఎస్ పథకంలో ఆదాయంలో పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కార్యాలయంలో తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ఆధ్వర్యంలో తుడా పరిధిలోని అన్ని మునిసిపల్ కమిషనర్లు, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎల్ఆర్ఎస్, బిపిఎస్ పట్టణ ప్రణాళిక, మౌలిక వసతులు కల్పన, ఆదాయ వనరుల మెరుగుపరచడం అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. తిరుపతి, పరిసర పట్టణాల్లో అభివృద్ధి వేగవంతం చేయడమే ఈ సమావేశం ప్రధాన లక్ష్యంగా తుడా చైర్మన్ పేర్కొన్నారు. తిరుపతి గరుడ వారధి పై ప్రమాదాల నివారణ చర్యలను తక్షణమే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. తుడా అధికారులు మున్సిపల్ శాఖ అధికారులు సమన్వయం చేసుకొని పనిచేస్తూ పట్టణాభివృద్ధిలో ముందుకు వెళ్ళాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తిరుపతి డిసిపి మహబూబ్ ఖాన్ , తిరుపతి సిటీ ప్లానింగ్ అధికారులు మూర్తి మధుసూదన్ తుడా పరిధిలోని మున్సిపల్ కమిషనర్లు, తుడా సెక్రటరీ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, అర్బన్ లోకల్ బాడీ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గరుడ వారధిని పరిశీలించిన తుడా ఛైర్మన్

గడిచిన నెల కాలంలో తిరుపతి గరుడ వారధి పై వరుస ప్రమాదాలు జరిగిన విషయం తెలిసిందే. ప్రమాదాల నివారణ చర్యలలో భాగంగా తుడా చైర్మన్ తితిదే ఎక్స్ అఫిషియో మెంబర్ డాలర్స్ దివాకర్ రెడ్డి మంగళవారం మున్సిపల్ అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు అతివేగంతో నడపడం వల్ల ప్రమాదాలకు దారితీస్తోందన్నారు. ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని మున్సిపల్ శాఖ అధికారులకు సూచించారు. ఆయన వెంట ఇంచార్జి మున్సిపల్ అడిషనల్ కమిషనర్, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ అధికారులున్నారు.

నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

తుడా అధ్వర్యంలో తిరుపతి నియోయకవర్గ పరిధి ఆటో నగర్‌లో తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తుడా చైర్మన్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధితులుగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీనరీ, బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ విచ్చేశారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు, వైజాగ్ చెన్నై కారిడార్పైపు లైన్ పనులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి దుగ్గరాజపట్నం పనులు, శ్రీ సిటీలోని ఎల్జి కంపెనీకి సంబంధించి అంశాలపై పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక భద్దంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జాతీయ రహదారులకు, రైల్వే ప్రాజెక్ట్ పనులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైప్ లైన్ పనులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి దుగ్గరాజపట్నం పనులు, శ్రీ సిటీలోని ఎల్జి కంపెనీకి సంబంధించి అంశాలు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, నిర్మాణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో తిరుపతి, నెల్లూరు , చెన్నై నేషనల్ హైవే పి డి లు, తిరుపతి, సూళ్లూరుపేట ఆర్డీఓలు, రామ్మోహన్, కిరణ్మయి, రోడ్డు భవనాల శాఖ ఎస్.ఈ రాజా నాయక్, రైల్వే ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ సంబంధిత మండలాల తహశీల్దార్లు, కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైపు లైను పనులు, రైల్వే ప్రాజెక్ట్ పనులు పురోగతిలో ఉన్న పనులపై రేణిగుంట, పూడి, గూడూరు, రేణిగుంట, పాకాల, తిరుపతి టౌన్ సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. ఆరు లైన్ల రహదారులు నిర్మాణం, రేణిగుంట నుండి చెన్నై రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని నాణ్యత తో పనులు పూర్తి కావాలన్నారు. పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఎడిబి రోడ్లు పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో శ్రీకాళహస్తి ఆర్డిఓ, బానుప్రకాష్ రెడ్డి, తిరుపతి, నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు విజయ్ భరత్ రెడ్డి, ఎల్. శివకుమార్, తిరుపతి తహసీల్దార్ సురేష్, సంబంధిత తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లు , భూసేకరణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ స్థాపనే లక్ష్యం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ స్థాపనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. మంగళవారం తిరుపతి పద్మావతి అతిథి గృహంలో నగరపాలక సంస్థ అధికారులతో సమావేశం నిర్వహించారు. నగరంలో ఇంటింటి చెత్త సేకరణ, తరలింపు, ప్రాసెసింగ్ తదితర విషయాలను డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌లు వివరించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధన కొరకు గత 11 నెలలుగా ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల అమలును పరిశీలించి తగు సూచనలు ఇచ్చేందుకు చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లోని ఐదు మున్సిపాలిటీ ల్లో సమీక్షా సమావేశాలు నిర్వహించామని తెలిపారు. తిరుపతి లో పెద్ద ఎత్తున బయో మైనింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం వదిలేసి వెళ్లిన కొన్ని వేల టన్నుల చెత్తను శుభ్రం చేసి, వివిధ ప్రాంతాలను సుందరమైన పార్కులుగా తీర్చిదిద్దుతామన్నారు. తిరుపతి గ్రీనరి అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మతో కలసి పార్కులు పెంచి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం తెచ్చేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తూకివాకంలో గల ఇంటిగ్రేటెడ్ వెస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ను ముఖ్యమంత్రి పరిశీలించారని ఆ ప్లాంట్ ను స్వచ్ఛఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో మరింత అభివృద్ధి చేసేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రిసైక్లింగ్ ఫ్యాక్టరీలు కూడా తిరుపతి ప్రాంతాల్లో రానున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా స్టేట్ గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్. సి. మునికృష్ణ, తదితరులు సన్మానించారు. మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, డి.ఈ.లు రమణ, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

దళితులపై దౌర్జన్యం చేసిన

ఫారెస్ట్ రేంజర్ పై చర్యలు తీసుకోవాలి : సిపిఎం



దళితులపై దౌర్జన్యం చేస్తున్న ఫారెస్ట్ రేంజర్ మాధవి

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: తిరుపతి జిల్లా, నారాయణవనం మండలం, వెత్తల తడుకు గ్రామంలోని దళితులు సాగు చేస్తున్న వ్యవసాయ భూమిపైకి పది మంది ఫారెస్ట్ సిబ్బందితో దౌర్జన్యం చేసిన ఫారెస్ట్ రేంజర్ డి.మాధవి పై చర్యలు తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) తిరుపతి జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ 1975లో ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి ఇచ్చిన ఆదేశాల ప్రకారం దళితులకు భూమి దక్కిందని, వారు ఆ భూమిలో వ్యవసాయ క్షేత్రాన్ని నిర్మించి వ్యవసాయం చేసుకుంటున్నారని, ఈ సమస్యపై 2016లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్ కారం శివాజీ నేరుగా దళితులతో మాట్లాడి జిల్లా కలెక్టర్‌కి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని అయితే అధికారులు ఇప్పటివరకు పట్టాలు మంజూరు చేయలేదని తెలిపారు. ఏఎస్ నెంబర్ 148 / 1975 తో ఫారెస్ట్ అధికారులు వేసిన కేసుని జిల్లా కోర్టులో కొట్టివేయడం జరిగిందన్నారు. ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ ఇచ్చిన ఆదేశాల్లో ఆరెప్ప మొదలి, సామినేని ఆదయ్య, గురవయ్య అనే ముగ్గురు ఉన్నారని, మొదటి ఇద్దరికి మాత్రం వ్యవసాయం చేసుకోవడానికి అనుమతిస్తూ దళితులకు అడ్డుకోవడం సరైనది కాదని కోరారు. నూతన కూటమి ప్రభుత్వానికి డిప్యూటీ సీఎం కార్యాలయానికి గ్రామస్తులు వెళ్లి ఫిర్యాదు చేశారని, తెలుగుదేశం కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేశారని ఆ ఫిర్యాదులు స్థానిక రెవెన్యూ కార్యాలయాల వచ్చి ఉన్నాయని వాటి మీద చర్యలు తీసుకోవాల్సి ఉందని తెలిపారు. హైకోర్టులో కేసు పట్టాల కొరకు జరుగుతున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అత్యుత్సాహంతో ఇటువంటి దుందుడుకు చర్యలకు పాల్పడడం సరైనది కాదని తెలిపారు. దళితులు భూమిని చదును చేసుకొని వ్యవసాయ క్షేత్రాన్ని నిర్మించుకొని ఫెన్సింగ్ చేసుకొని వ్యవసాయం చేసుకుంటున్నారని తెలిపారు. ఈ విషయం స్థానిక ప్రజలకే కాక రెవెన్యూ అధికారులకి ఫారెస్ట్ అధికారులు కూడా తెలుసునని తెలిపారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న ఫారెస్టర్ అధికారి మాధవిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. దళితుల పోరాటానికి అన్ని రాజకీయ పార్టీలు దళిత సంఘాలు అండగా ఉండాలని కోరారు.

ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యం ఆపాలి

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం విజ్ఞప్తి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : దళితులు సాగు చేసుకుంటున్న భూములపై ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడం దారుణమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ మండిపడ్డారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ వెంకటేష్‌లు మాట్లాడుతూ, గతంలో దళితులకు ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ ఇచ్చిన ఆర్డర్‌ను అమలు చేయకపోవడం వలన, ఇప్పుడు అది ఫారెస్ట్ భూమి అని భావించి దళితులకు ఆర్డర్ ఉన్న భూములపై ఆక్షేపణ చేయడం సరికాదన్నారు. దళితుల భూములకు పక్కనే ఉన్న మరో 100 ఎకరాలు భూములపై అదే సెటిల్మెంట్ ఆఫీసర్ ఇచ్చిన ఆర్డర్ని భూస్వాములకు, ధనవంతులకు అమలుపరిచిన అధికారులు, దళితులకు అమలు పరచక పోవడంతో అప్పటినుండి ఇప్పటివరకు పోరాటం చేస్తూనే ఉన్నారని తెలిపారు. అటవీ హక్కుల చట్టం ద్వారా గిరిజనేతరులకు సాగులో ఉంటే పట్టాలు ఇచ్చే విధంగా చట్టం ఉన్నప్పటికీ దళితులు ఎప్పటినుంచో ఈ భూమిలో సాగులో ఉన్నారు కాబట్టి ఫారెస్ట్ అధికారులు అర్థం చేసుకొని సహకరించాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్త ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణవనం సిఐటియు మండల కార్యదర్శి ముని శంకర్, ప్రజలు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలు వీడాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మూఢ విశ్వాసాలు లేని సమాజాలే వివిధ రంగాలలో పురోగమిస్తాయని ప్రముఖ మెజిసియన్, మిమిక్రీ ఆర్టిస్ట్ విజయ కుమార్ పేర్కొన్నారు. ఆయన జన విజ్ఞాన వేదిక నిర్వహించిన మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన జిమ్మికులను మహత్యాలుగా ఎలా ప్రదర్శిస్తారో చేసి చూపించారు. జన విజ్ఞాన వేదిక ప్రతి సంవత్సర నిర్వహించే చెకుముకి సంబరాలలో బాగంగా తిరుపతి పట్టణ స్థాయి/మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను మంగళవారం తిరుపతి లిటిల్ ఏంజెల్ స్కూల్‌లో నిర్వ హించినట్లు పట్టణ జన విజ్ఞాన వేదిక కార్యదర్శి రఫీ తెలిపారు. స్కూల్ స్థాయి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు, పట్టణ స్థాయి సైన్సు సంబరాలలో పాల్గొన్నారు. పట్టణ/మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు టాలెంట్ టెస్ట్‌లో రాణించిన వారు జిల్లా స్థాయిలో నవంబర్ 23న జరిగే సైన్స్ సంబరాలలో పాల్గొంటారు. ఆమూరి సుబ్రమణ్యం జన విజ్ఞాన వేదిక పాటలతో అలరింప చేశారు. నెమిలేటి కిట్టన్న విద్యార్థులకు కథలు ఎలా రాయాలో తెలియజేశారు. ఈ కార్యక్రమములో జెవివి జిల్లా కార్యదర్శి సుంకర రెడ్డెప్ప, రఫీ, బిర్లానాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే చిరుతలతో ముప్పు లేదు

త్వరలో అందుబాటులోకి గజ ట్రాక్టర్ యాప్ : మీడియాతో డిఎఫ్ఓ సాయిబాబా



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ ప్రాంతం నుండి వేదిక్ యూనివర్సిటీ పరిసరాలకు చిరుత పులులు వస్తున్న నేపథ్యంలో నిబంధనలు పాటిస్తే ముప్పు ఉండదని తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి సాయిబాబా పేర్కొన్నారు. మంగళవారం కపిలతీర్థం వద్దగల జిల్లా అటవీశాఖ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్సిటీ పరిధిలో వ్యర్థాలు ఎక్కడబడితే అక్కడ వేయడం వలన ఆహార అన్వేషణలో భాగంగా వచ్చే జీవజాలాల కోసం చిరుతపులులు వస్తున్నాయని, వ్యర్థ నిర్వహణ సక్రమంగా చేయాలని ఇప్పటికే వర్సిటీ అధికారులకు సూచించామన్నారు. త్వరలో తిరుపతికి రానున్న వైల్డ్ లైఫ్ అథారిటీ ఆఫ్ ఇండియా వారికి నడక దారిలో ఎలివేటెడ్ కారిడార్, చిరుతల సంచారాన్ని తగ్గించడానికి సోలార్ ఫెన్సింగ్ వంటి ఆలోచనలు వారి దృష్టికి తీసుకెళ్తామన్నారు. అటవీ శాఖ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో అనధికారిక దుకాణాలపై పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి జిల్లాలో ఉన్న 40 ఏనుగులు మూడు గ్రూపులుగా విడిపోయి పనబాకం, మామండూరు, భాకరాపేట పరిసర అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్నాయన్నారు. గజరాజుల సంచారం వలన ఎవరికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏఐ టెక్నాలజీతో శబ్దాలు చేస్తూ ఏనుగుల గుంపును దారిమళ్లించే చర్యను ఈ ప్రాంతంలో అవసరమైతే వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. 15 మంది ఎలిఫెంట్ ట్రాకర్స్ అందుబాటులో ఉన్నారని, వారి సేవలను వినియోగించుకుంటున్నామన్నారు. చిరుతల వలన ప్రజలకు, తిరుమలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తమ సిబ్బంది అందుబాటులో ఉంటూ తగిన సూచనలు చేస్తున్నారన్నారు. తిరుపతి జిల్లాలో అటవీ శాఖ చేపట్టబోయే కొన్ని కార్యక్రమాలను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లనున్నామ్మన్నారు.

అంగన్వాడీ నిర్వహణ భేష్

అసిస్టెంట్ కలెక్టర్ రఘువంశ



ప్రజాశక్తి - రేణిగుంట : రేణిగుంట మండలం, విప్పమాన పట్టడ పంచాయతీఃం మంగళవారం తిరుపతి జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ రఘువంశ అంగన్వాడి కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. సర్పంచు లక్ష్మీపతి రెడ్డిని, అంగన్వాడీ సిబ్బందిని అభినందించారు. రేణిగుంట మండలంలోని ప్రతి అంగన్వాడీ ఈ కేంద్రాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

కౌలు రైతులకు యూరియా ఇవ్వండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రి మండలం, వెస్ట్ వర్తూరు సచివాలయంలో మంగళవారం రెవెన్యూ విఆర్ఓ మురళికి జిల్లా రైతు సంఘం ఉపాధ్యక్షులు ధనంజయులు కౌలు రైతులకు యూరియా ఇవ్వాలని వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా అందక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తుఫాను కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కౌలు రైతులకు, పట్టాదారు పాసుపుస్తకాలు లేని రైతులకు యూరియా అందించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు ఆదయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యం కుటుంబాన్ని ఆదుకుంటాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కుటుంబ పెద్దదిక్కు, చేతికందొచ్చిన కొడుకును పోగొట్టుకున్న భవన నిర్మాణ రంగ కార్మికుడు ఉలస సుబ్రమణ్యం కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ హామీ ఇచ్చారు. పట్టణంలోని లక్క హరిజనవాడకు చెందిన ఉలస సుబ్రమణ్యం, ఆయన కుమారుడు రూపేష్‌లు పెళ్లకూరు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆ మేరకు మంగళవారం మృత దేహాలకు నివాళి అర్పించిన బృందమ్మ అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుబ్రమణ్యం కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, పేట బాలాజీ, గోవిందు, శివ, నింద్ర సుధాకర్ రాంబాబు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్జిటి దేవరాజులును విధుల నుండి తొలగింపు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రేణిగుంట మండలం, గుండ్ల కలువ, ఎంపీపీఎస్ పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వర్తించే దేవరాజులు విధులకు హాజరుకాకుండా, ఉన్నతాధికారుల ఆదేశాలను లెక్కచేయకుండా వ్యవహరిస్తుండడంతో ఆయనను విధుల నుండి తొలగిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. 2022 జూన్ 27వ తేదీ నుండి విధులకు హాజరు కాకపోవడంతో పలుమార్లు ఆయనకు నోటీసులు, నేరుగా అధికారుల వద్దకు వచ్చి హాజరుకావాలని రిజిస్టర్ పోస్టులు పంపినా కూడా స్పందించలేదన్నారు. విద్యాశాఖ నిబంధనల మేరకు దేవరాజులును తొలగిస్తున్నామన్నారు.

సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సిఐటియు అఖిల భారత 18వ మహాసభలు డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4 తేదీ వరకు విశాఖపట్నంలో జరుగనున్నాయని, ఈ మహాసభలను జయప్రదం చేయాలని సి.ఐ.టి.యు ఆటో యూనియన్ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వి.రమణయ్య పిలుపునిచ్చారు. మంగళవారం గూడూరు సి.ఐ.టి.యు కార్యాలయంలో జరిగిన మార్కెట్ ఆటో స్టాండ్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో కార్మికులందరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మహాసభలకు విరాళాలు అందజేశారు. అనంతరం నూతన కమిటిని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బి.రమేష్, ఉపాధ్యక్షులుగా బల్లి. పెంచలయ్య, కార్యదర్శి యం.అర్జున్, సహాయ కార్యదర్శిగా కె.శ్రీనివాసులు, ట్రెజరర్ ఎస్.డి.భాషాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా డి.శ్రీనివాసులు, ఎం.కోటేశ్వరరావు, బి.బాల్నర్, జె.ప్రవాస్, ఎస్.కె.షారుక్, ఆర్.సురేంద్ర, జె.ప్రదీప్, కె. దినేష్, ఎ.కోటయ్యలు కొనసాగుతారు.

ప్రజాశక్తి - కేవిబి పురం: విశాఖపట్నంలో జరుగనున్న సిఐటియు అఖిలభారత 18వ మహాసభను జయప్రదం చేయాలని తిరుపతి జిల్లా ఆశ వర్కర్ల సంఘం గౌరవ అధ్యక్షురాలు ఆర్ లక్ష్మి పిలుపునిచ్చారు. కేవిబీ పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కోవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఆశా వర్కర్ల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ సిఐటియు అఖిలభారత మహాసభలకు అందరూ నిలిచి పోర్టు అని స్పష్టం చేశారు. 31 నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే 18వ ఆల్ ఇండియా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రాజేశ్వరి, ఆశా వర్కర్లు సరళ, సుమ, సుజాత, రమణమ్మ కవిత తదితరులు పాల్గొన్నారు.

మెనూ పాటించండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మధ్యాహ్నం భోజనం పంపిణీలో పిల్లలకు మెనూ ప్రకారం రుచికరమైన భోజనం పెట్టాలని ఎం ఈవో మునిసుబ్రమణ్యం ఆదేశించారు. ఆయన మంగళవారం బుచ్చినాయుడు కండ్రిగ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు.

ఆర్టీసీ బస్సును పునరుద్ధరించండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు నుండి నెలబల్లి ,రెట్టపల్లి కి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం గూడూరు సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గూడూరు నుండి నెలబల్లి, రెట్టపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సు వస్తుండేదని, గత రెండు ఏళ్లుగా రావడం లేదని తెలిపారు. గూడూరుకి రావాలంటే ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఓదూరు, పునవపాటి పాలెం గ్రామాలకు కూడా ఆర్టీసీ బస్సు సర్వీసును నడపాలని కోరారు. అనంతరం డిపో మేనేజర్ కి వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ జిల్లా స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో గూడూరు డివిజన్ స్థాయి క్రీడాకారులు రాణించి డివిజన్‌కు గుర్తింపు తీసుకురావాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు, అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గూడూరు డివిజన్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారను. స్పోర్ట్స్ జెండా ఎగరవేసి, క్రీడాకారుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ సనత్ కుమార్, ఎంఈఓ కాంచన, నాయకులు బిల్లు చెంచురామయ్య, రహీం, ఇజ్రాయిల్, చంద్రమౌళి, ఉదయ శేఖర్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దిలీప్‌కు రాజనేని రామానాయుడు చేయూత

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కీళ్ళ వాతంతో బాధపడుతున్న దిలీప్‌కు రాజనేని రామానాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో వైద్య అందించడంతో, వీల్ ఛైర్‌కు పరిమితమైన దిలీప్ నేడు కోలుకున్నాడు. ప్రతి 6 నెలలకు హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించుకునేందుకు కూడా రాజనేని రామానాయుడు ట్రస్ట్ సహకారమందిస్తోంది. అవసరమైన మందులు కూడా అందచేస్తున్నట్టు ట్రస్టు వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసులు నాయుడు తెలియజేశారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విద్యుత్ శాఖ తిరుపతి సర్కిల్ ఎస్ఈలు కే.కరుణాకర్ వి.చంద్రశేఖర్‌లను కోరారు. మంగళవారం తిరుపతిలోని విద్యుత్ శాఖ కార్యాలయానికి ఎమ్మెల్యే చేరుకుని ఎస్ఈ లకు వినతి పత్రం సమర్పించారు. పిచ్చాటూరు మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన ముడియూరు సబ్ స్టేషన్‌కు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని, సత్యవేడు మండలం, చమర్తి కండ్రిగలో తుది దశ నిర్మాణంలో ఉన్న సబ్ స్టేషన్ పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని, రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు. వినతులపై ఎస్ఈలు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

వేదవ్యాస్ విద్యాసంస్థలకు జాతీయ గౌరవం

■ ప్రిన్సిపల్ సీ.బాలసరస్వతికి బెస్ట్ ప్రిన్సిపల్ అవార్డు



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వేదవ్యాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రిన్సిపల్ అండ్ కరస్పాండెంట్ సీ.బాలసరస్వతికి ప్రతిష్టాత్మకమైన "బెస్ట్ ప్రిన్సిపల్ అవార్డు" లభించింది. ఈ అవార్డును ఇండియన్ టాలెంట్ ఒలింపియాడ్ సంస్థ ముంబైలో నిర్వహించిన ఘనమైన కార్యక్రమంలో ప్రదానం చేసింది. ఈ సందర్భంగా పుదుచ్చేరి మాజీ లెఫ్టినెంట్ గవర్నర్ డా. కిరణ్ బేడీ ఒలింపిక్ చాంపియన్, భారత గర్వం సైనా నెహ్వాల్ బాలసరస్వతికి అవార్డు అందజేశారు. విద్యా రంగంలో వినూత్న ఆలో చనలు, సమగ్ర అభివృద్ధి పట్లకట్టుబాటు, విద్యార్థుల ప్రతిభాభివృద్ధికి చేసిన విశేష కృషి ఆధారంగా ఈ పురస్కారం అందచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ గౌరవం వేదవ్యాస్ విద్యాసంస్థలకు మాత్రమే కాకుండా పుత్తూరు ప్రాంతానికి గర్వకారణమని విద్యాసంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు.

పిహెచ్‌సిని.. సిహెచ్‌సిగా మార్పు చేయాలి

ప్రజాశక్తి - పాకాల: పాకాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిహెచ్‌సి గా మార్పు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు మధుసూదన్ రావు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి వినతి పత్రం అందజేశారు. మంగళవారం పాకాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ ప్రారంభించడానికి విచ్చేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని కలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని దీనిని సిహెచ్సిగా మార్పు చేస్తే అందరికి ఉపయోగకంగా ఉంటుందని కోరారు. ఏఎన్ఎంలకు ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సంతకాల సేకరణ చేసిన మెమొరాండంను ఆయనకు అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించి త్వరలోనే న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు తప్పవు

ప్రజాశక్తి - రామచంద్రపురం : మండలంలోని నెత్తుకుప్పం రెవెన్యూ గ్రామ లెక్క దాఖలా, ఎల్.వి.పురం గ్రామ సమీపంలో ఉన్న గ్యాప్ ఏరియా(గుట్ట పరంబోకు స్థలం) లో అక్రమ గ్రావెల్ క్వారీని భూగర్భ గనుల శాఖ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. మంగళవారం ఎల్ వి పురం సమీపంలోని గుట్ట ప్రాంతంలో ఎన్ని క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వి అక్రమంగా తరలించారని కొలతలు తీశారు. గ్రావెల్ తవ్వకాలు చేసిన ప్రాంతం గ్యాప్ ఏరియాకు చెందినదిగా రెవెన్యూ అధికారులు గుర్తించి మైన్స్ అధికారులకు తెలియజేశారు. ఈ ప్రాంతంలో ఎవ్వరికి గ్రావెల్ క్వారీ అనుమతులు ఇవ్వలేదని మైన్స్ అధికారులు తెలిపారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల నుండి గ్రావెల్ తవ్వకాలు చేసి అక్రమంగా వాహనాలలో తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మాఫియాకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఎర్ర మట్టిని, గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తే వాహనాలు సీజ్ చేసి, జరిమానాలు విధిస్తామన్నారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు లారీలను సీజ్ చేసి, చంద్రగిరి పోలీసులకు స్వాధీన పరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైన్స్ సర్వేయర్ భాస్కర్ రెడ్డి, మైన్స్ అధికారుల బృందం వీఆర్వో వెంకటరమణ, వీఆర్ఏ బండారు గీతలు పాల్గొన్నారు.


క్వారీలను పరిశీలిస్తున్న అధికారులు

పీ-3ని అడ్డుకుందాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రభుత్వ వైద్య కాలేజీలను ప్రైవేట్ పరం చేసి, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయాలని చూస్తున్న కూటమి ప్రభుత్వ పి-3 విధానాన్ని అడ్డుకోవాలంటూ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబాబు సర్కారు రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రగా మార్చడంతో పాటు, ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్లకు అమ్మేయాలని చూస్తుందని మండిపడ్డారు. పీ-3 విధానానికి వ్యతిరేకంగా ఈనెల 11వ తేదీన చేపట్టనున్న భారీ నిరసన ర్యాలీకి వైసిపి శ్రేణులతో పాటు అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ముక్కంటి సేవలో చీరాల ఎమ్మెల్యే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య మంగళవారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. వీరికి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ సాగర స్వాగతం పరికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలకగా, ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ ముక్కంటి జ్ఞాపికలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

నాయుడుపేట మున్సిపాలిటీలో కోటి సంతకాల సేకరణ



ప్రజాశక్తి - నాయుడుపేట: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నాయుడుపేట మున్సిపాలిటీలోని 10, 11వార్డుల్లో నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. తమ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణకు చేస్తున్న కుట్రలను కోటి సంతకాలు పూర్తి చేయడం ద్వారా అడ్డుకుంటామన్నారు. అనంతరం స్థానిక వైసీపీ నాయకులతో కలిసి నాయుడుపేట మున్సిపాలిటీలోని 10,11 వార్డుల్లో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయుడుపేట పట్టణ అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి, నాయుడుపేట మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, మున్సిపల్ కౌన్సిలర్లు, దార రవిబాబు, పాలేటి నాగార్జున, చదలవాడ కుమార్, బైనా మల్లికార్జున్ రెడ్డి, పేర్నాటి రాహుల్, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

గూడూరులో యూరియా కొరతలేదు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు లో యూరియా కొరతలేదని, పంటలకు కావాల్సినంత యూరియా అందుబాటులో ఉందని గూడూరు వ్యవసాయ సహాయ సంచాలకులు గోపి నాయక్ మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ గూడూరు వ్యవసాయ కార్యాలయంలో యూరియా కొరత ఉన్నట్లు, రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టినట్లుగా ఒక పత్రికలో వచ్చిందన్నారు. కానీ గూడూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో యూరియా పొందేందుకు రైతులకు గుర్తింపు కార్డులు 80% ఇవ్వడం జరిగిందన్నారు. మిగతా 20% రైతులకి కూడా మరో రెండు మూడు రోజుల్లో ఇవ్వనున్నట్లు తెలిపారు. గూడూరు వ్యవసాయ సబ్ డివిజన్లో 250 మెట్రిక్ టన్నుల యూరియా ప్రైవేట్, వ్యవసాయ సహకార పరపతి సంఘం, రైతు భరోసా కేంద్రాలలో నిలువ ఉందని తెలిపారు. రైతులు ఆందోళన చెందనవసరం లేదని తెలియజేశారు.

నిత్యం విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - వాకాడు : వాకాడు మండల కేంద్రంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో నిరంతరం విద్యుత్ ఏర్పడి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మంగళవారం ఉదయం 9:30 నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా లేదని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. ఇంతేకాక ట్రాన్స్ఫార్మర్ల మరమ్మతులకు ప్రజల వద్ద సొమ్ము వసూలు చేస్తున్నారని ఆరోపణలు కూడా వినపడుతున్నాయి. అర్ధరాత్రుళ్లు విద్యుత్ అంతరాయం ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్ఫార్మర్ల కెపాసిటీకి మించి లోడ్ పెట్టడంతో నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారని, దీనిపై అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఘనంగా ఖాదర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : టీడీపీ ఐటీ విభాగం శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్షులు ఖాదర్ బాషా జన్మదిన వేడుకలు మంగళవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఖాదర్ బాషాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. టీడీపీ నేతలు కన్నలి ప్రతాప్ రెడ్డి, నాగమల్లి దుర్గాప్రసాద్, బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల పిపిపి విధానాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఇచ్చాపురం నుంచి హిందూపురం వరకు జరుగుతున్న బస్సు యాత్ర 14వ రోజు తిరుపతికు చేరుకున్న సందర్భంగా తిరుపతి కోమల రెడ్డి సర్కిల్ న్యూ బాలాజీ కాలనీలో రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఈ బహిరంగ సభలో ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కే.శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ తమిళనాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దినేష్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి వలరాజు, నాసర్, రాష్ట్ర సహాయ కార్యదర్శిలు కుల్లాయి స్వామి నాగభూషణం, వైయస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబుల్ రెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రవీణ్ కుమార్, ఉదయ్ కుమార్, ఆంధ్ర యూనివర్సిటీ కార్యదర్శి అభి ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, వైయస్సార్ విద్యార్థి విభాగం అన్నమయ్య జిల్లా అధ్యక్షులు కిషోర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను పరచిందన్నారు. గత ప్రభుత్వం మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ చేసిందని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గగ్గోలు పెట్టిన చంద్రబాబు, లోకేష్‌లు అధికారంలోకి వచ్చిన తర్వాత 100% మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తున్నారని మండిపడ్డారు. విద్యా వ్యతిరేక విధానాలు పరిష్కరించకపోతే కూటమి ప్రభుత్వాన్ని కూలగొట్టేందుకు విద్యార్థులు అగ్ర భాగాన నిలుస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతపురంలో ఈనెల 12వ తేదీ ముగింపు సభ నిర్వహిస్తామని, ఈ సభ అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నల్సా స్థాపకులు సుందర్ రాజ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ హరికృష్ణ, మోహన్ నగర నాయకులు వినయ్, విష్ణు, సురేష్ , సుబ్బు, వైయస్సార్ విద్యార్థి విభాగం నాయకులు చంగల్ రెడ్డి, శేషారెడ్డి, వినోద్, మోహన్ రెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్ ఛాంపియన్ ఎస్‌పిడబ్ల్యు కళాశాల

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినిలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సెట్విన్ ఆధ్వర్యంలో యువజనోత్సవ పోటీలలో తిరుపతి. ఎమరాల్డ్స్ జూనియర్ కళాశాల వేదికగా వివిధ కళాశాల నుంచి గ్రూప్ డాన్స్ కథా రచనల పోటీ, కవిత్వ రచనల పోటీ వివిధ విభాగాల్లో అన్నింటిలో గెలుపొంది ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ని గెలుచుకొని డిసెంబర్ నెలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి వెల్లడించారు. గ్రూప్ డాన్స్ జానపద నృత్యం నరసింహస్వామి వృత్తాంతం పైన జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం గెలుచుకోగా అదేవిధంగా గ్రూప్ పాట జానపద పాటల్లో రైతు గురించి రెండో స్థానంలో నిలువగా, గ్రూప్ డాన్స్ గళ్ళు గళ్ళు గజ్జల బండిని మరో జానపద నృత్యంతో మూడో స్థానంలో నిలిచారు. ఇలా ప్రతి విభాగం నుంచి ఒక్కో బహుమతిని గెలుపొంది, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినిలందరినీ ప్రిన్సిపల్ అభినందించి, వీరికి శిక్షణ ఇచ్చిన నృత్య, సంగీత మాస్టర్ పవన్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలందరిని అధ్యాపకులు అభినందించారు.

కరాటే పోటీల్లో ఎంజీఎం విద్యార్థిని సత్తా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పుదిచ్చేరిలో జరిగిన సెకండ్ డ్రీమ్ ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో ఎంజీఎం స్కూల్ విద్యార్థిని ఈ.క్యాతిశ్రీ ఉత్తమ ప్రతిభ కనబరిచింది. అండర్ 14 విభాగంలో పోటీపడ్డ క్యాతిశ్రీ రెండో స్థానంలో నిలిచి సిల్వర్ రజత పతకం గెలుపొందింది. ఈ సందర్భంగా క్యాతిశ్రీని ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ గుడ్లూరు మయూర్ మంగళవారం అభినందించారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ఎంజీఎం అధిక ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. హెచ్‌ఎం ముని రత్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.



క్యాతిశ్రీకి అభినందన

పవన్ కళ్యాణ్ మాటలు అభినందనీయం : భూమన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: పులికాట్ సరస్సులో ఫ్లెమింగో పక్షులకు శాశ్వత నివాసం కల్పించాలని డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్ మాటలు అభినందనీయమని టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. పద్మావతిపురంలోని ఆయన నివాసంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ మీ పేరులోనే పవనం, కళ్యాణం రెండు ఉన్నాయి. ఫ్లెమింగ్ పక్షులు అనేవి సైబీరియ నుంచి వందల ఏళ్ల నుంచి, ఎంతో దూరంనుంచి వలస వస్తున్నాయన్నారు. పులస చేపల్ని కూడా గోదావరిలో శాశ్వతంగా ఉండేట్లు నివాసం కల్పించాలని కోరుతున్నామన్నారు. ఏప్రిల్, మే నెలల్లో రాష్ట్రంలో చల్లదనం శాశ్వతంగా ఉంచాలని కోరుతున్నామని ఎద్దేవా చేశారు. సనాతన ధర్మ పరి రక్షకా మీరు ఇంకా ఎన్నో చేయాలని హితవు పలికారు. ప్రమాదాలు జరగకుండా రోడ్లు, దేవాలయాల్లో ప్రమాదాలు జరగకుండా, మద్యం మత్తులో అనర్థాలు జరగకుండా చూడాలి. మీరు గాల్లో పక్షుల్ని, నీటిలో చేపల్ని మీరు ఆధీనంలో ఉంచుకోవాలనుకోవడం అభినందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రకృతి ఆదేశించే శక్తి మీకు కలగాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నానన్నారు. ఇప్పటికే మీ జ్ఞాన తృష్ణ, ప్రజలకు అర్థం అయ్యింది అంటూ ఎద్దేవా చేశారు.

డాక్టర్ జనార్ధన్‌కు పితృ వియోగం

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలం, గురవరాజు పల్లికి చెందిన ప్రముఖ వైద్యులు తేనెపల్లి జనార్ధన్ తండ్రిగారైన మాజీ సర్పంచ్ తేనేపల్లి రామచంద్రయ్య మంగళవారం అనారోగ్యంతో స్వర్గస్తులయ్యారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వారి గ్రామానికి చేరుకొని ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ అధ్యక్షుడు సిద్ధా గుంట సుధాకర్ రెడ్డి, వైయస్సార్సీపి మండల అధ్యక్షుడు గంగారి రమేష్, సర్పంచులు మునిశేఖర్ రెడ్డి, ముద్దురాయలు, విజయ్ కుమార్, వెంకటముని, రమేష్, జగన్, శివ తదితర నాయకులు పాల్గొన్నారు.


తేనేపల్లి రామ చంద్రయ్య (ఫైల్ ఫోటో)

ఎస్వీయూ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం బోధనేతర ఉద్యోగుల సంఘం లెటర్ దుర్వినియోగానికి పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఎస్వీయూ పోలీస్ స్టేషన్లో ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు కార్తీక్ మాట్లాడుతూ సెంట్రల్ అసోసియేషన్ లెటర్ హెడ్‌ని గుర్తు తెలియని వ్యక్తులు దుర్వినియోగం చేస్తూ అసాంఘిక పదజాలంతో అధికారుల లెటర్లు రాస్తూ ప్రభుత్వానికి పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంగళవారం ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. స్పందించిన సీఐ తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

కోట తహశీల్దార్‌కు అభినందన



ప్రజాశక్తి -కోట : తుఫాన్ నేపథ్యంలో విశేష కృషి చేసిన తహశీల్దారు కటారి జయ జయ రావు రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు చేతుల మీదగా అవార్డు అందుకున్న విషయం విదితమే. ఈ సందర్భంగా తిన్నెలపూడి పంచాయతీకి చెందిన టీడీపీ నాయకురాలు గండవరం సుష్మారెడ్డి ఆయనను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తిన్నెలపూడి పంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు మండలం, తడుకు పంచాయతీ పరిధిలోని, వీఎస్ఎస్‌పురంలో మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఒక పూరిల్లు దగ్ధమైంది. వివరాల్లో వెళితే గ్రామానికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తి కుటుంబంతో నివాసముంటున్న పూరి గుడిసె అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో ఇంటిలోని గృహోపకరణాలు, దుస్తులు, దగ్ధమయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదు. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే గుడిసె పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ ఘటనా స్థలాన్ని పరిశీలించి తక్షణ అవసరాలు అందించారు. ప్రభుత్వం తరపున ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-రేణిగుంట మార్గంలోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్సి బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న నెల్లూరు జిల్లాకు చెందిన సాయి చందు 20 మంగళవారం ఉదయం హాస్టల్ భవనంపై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకెళితే నెల్లూరు జిల్లా స్టోన్ హౌస్ పేటకు చెందిన శ్రీనివాసులు కుమారుడు, సాయి చందు సోమవారం రాత్రి తండ్రికి ఫోన్ చేసి కళాశాలలో ఫీజు కట్టాలని, రేపు ఉదయం రావాలని కోరాడు. దీంతో శ్రీనివాసులు మంగళవారం ఉదయం కొడుకు సాయి చందు ఉంటున్న హాస్టల్ గదికి వెళ్ళగా అక్కడ లేకపోవడంతో అతని స్నేహితుడిని అడగగా మిద్దె పైకి వెళ్లాడని చెప్పడంతో ఇరువురుపైకి వెళ్లి చూడగా ఉరి వేసుకుని ఉండడానికి గుర్తించి హుటాహుటిన నారాయణాద్రి హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా సాయి చందు మృతికి ప్రేమ వ్యవహారమే కారణమా అనే విషయాలు పోలీసుల దర్యాప్తులో తెలాల్సి ఉంది.


సాయి చందు (ఫైల్ ఫోటో)

కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కడుపునొప్పి తాళలేక మహిళ ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన శ్రీకాళహస్తిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని గాండ్లవీధిలో చలపతి, కవిత దంపతులు నివాసముంటున్నారు. ఈ నేపథ్యంలో కవిత కొన్నేళ్లగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆమె భర్త చలపతి రెండేళ్ల కిందట శస్త్ర చికిత్స కూడా చేయించారు. అయినప్పటికీ కవిత(44)కు కడుపునొప్పి నయం కాకపోవడంతో మనస్థాపానికి గురై మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్విమ్స్ పరిశోధక విద్యార్థికి డాక్టరేట్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) యూనివర్సిటీ కార్డియాలజి విభాగంలో పరిశోధనలు నిర్వహించిన విద్యార్థి డాక్టర్ విజయ చంద్రా రెడ్డి కొండాకి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పి.హెచ్.డి) పట్టాను ప్రధానం చేసినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్విమ్స్ పరిశోధక విద్యార్థి డాక్టర్ విజయ చంద్రా రెడ్డి కొండా కార్డియాలజి విభాగంలో ఎఫెక్ట్ ఆఫ్ హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ ప్రాక్టీసెస్ ఆన్ ఎండోథెలియల్ ఫంక్షన్ అండ్ ఇన్ ఫ్లమేషన్ ఇన్ పేషెంట్స్ విత్ కరోనరీ ఆర్టరీ డిసీజ్ " అనే అంశముపై పరిశోధన నిర్వహించారు. కార్డియాలజి విభాగం చీఫ్ గైడ్ సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ వి. వనజాక్షమ్మ పర్యవేక్షణలో సమర్పించిన ఈ గ్రంధాన్ని యూనివర్సిటి బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ వారు పరిశీలించి పి.హెచ్.డి. డిగ్రీ ప్రధానం చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శిల్పా కడియాల అధికారంగా ప్రకటించారు.


విజయ చంద్రా రెడ్డి

క్రీడా సామగ్రి పంపిణీ



ప్రజాశక్తి - రామచంద్రపురం: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని చిత్తూరు పార్లమెంటు నియోజక వర్గం టిడిపి అధికార ప్రతినిధి ఎన్ చిన్నబాబు కోరారు. మంగళవారం మండలంలోని కుప్పం బాదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షాందాషాన ఫౌండేషన్ వారి ఆర్థిక సహాయంతో సొసైటీ ఫర్ సోషల్ సర్వీస్ సంస్థ క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి జయ వేలు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. క్రీడా పరిక రాలు అందించిన సంస్థ కార్యదర్శి ఎస్ సుబ్రహ్మణ్యంకు ప్రధానోపాధ్యాయురాలు సుజన కుమారి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు యువరాజ్ యాదవ్, పట్నం రామయ్య, శంకర్, పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

BEFORE THE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION II TIRUPATI
CC NO. 14/2025
K. Ramesh Kumar ...Complainant
V/s
Willer energy rep by its authorised parties signatory Tirupati and another opposite parties
Notice to the opposite Parties No. 1 and 2
1. Willer Energy rep its authorised signatory D.No.18-36, Madhura Nagar, Tirupati.
2. Willer Engineers rep by its Authorised signatory, Flat No. 42, Sivasai enclave, D.No. 46-7, Gundlasagaram, Chittoor
Please take notice that the complainant filed above case against you for refund the amount of Rs. 92108 and other reliefs and case is posted to 11-11-2025 for your appearance. You shall apear on 11-11-2025 at 10:30am in person or through advocate, if you failed to appear the case will be decided in your absence.
G.GURUPRASAD
Advocate, Tirupati

మహారాజశ్రీ నాల్గావ అదనపు జూనియర్ సివిల్ జడ్జీ వారి కోర్టు, తిరుపతి
ఓ.ఎస్.నెం. 897/2023
పి.మల్లీశ్వరి దేవి ...వాది
V/s
కె.మహాలక్ష్మి ...ప్రతివాది
ప్రతివాదికి సమన్లు
కె.మహాలక్ష్మి భర్త జి.సునీల్ కుమార్,
డి.నెం.12-6-72, నందనవనం లేఅవుట్,
తిరుచానూరు, తిరుపతి జిల్లా
పై దావాలో మీ యొక్క హాజరుకు గాను 19.11.2025వ తేదీన పై కోర్టులో వాయిదా వున్నది. ఆ దినం ఉదయం 10.30 గం॥లకు మీరుగాని, మీతరపు వకీలు గాని, పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో కేసు మీ పరోక్షమున తీర్మానించబడును. **వాయిదా తేది. 19.11.2025**
రాయపనేని గజేంద్ర
పి.సుజాత
డి.వి.ఎల్.డిల్లీబాబు, బి.అకిలేష్
అడ్వకేట్స్, డి.నెం.19-3-1/సి4, 3వ క్రాస్ (లెఫ్ట్),
పోస్టల్ కాలనీ, రేణిగుంట రోడ్డు, తిరుపతి.
సెల్: 9490276001

IN THE COURT OF IVth SMALL CAUSES COURT AT CHENNAI
M.C.O.P No. 3112 of 2025
Ramanamma and Others ...**Petitioners**
-Vs-
1. Balaji Rao
2. A. Prasanth Rao
3. Tata AIG General Insurance Co., Ltd.,
...**Respondents**
To,
A. Prasanth Rao, Block No.27-F1, Dami needu, Tirupati, Andhra Pradesh-517503
... **For 2nd Respondent**
PAPER PUBLICATION
Please take notice that the above M.C.O.P No. 3112/2025 has been Posted for your appearance on 25.11.2025 before the IV Small Causes Court at Chennai. Hence you are requested to appear before the Hon'ble Court on 25.11.2025 at about 10.30 A.M. failing which you will be set exparte and the case will be decided on merits.
Hg: 25.11.2025
JSVS SARVESWARA RAO
Counsel for Petitioners

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) TIRUPATHI
I.A. No.712 of 2025
O.S. No. 33 of 2017
Puttur Murali Vasu @ Vasu
...**Petitioner/Plaintiff**
Vs.
1. P. Kesavachari & 22 others
...**Respondents**
To: Respondent Nos. 21 to 23/Proposed Parties/D-21 to D-23:
1. A. Prasanna, W/o. Late A. Bhaskar Naidu, (Proposed party)
2. A. Saranya, D/o Late A. Bhaskar Naidu, (Proposed party)
3. A. Thanuja, D/o Late A. Bhaskar Naidu, (Proposed party)
All are residing at D.No. 19-12-197RC3, Bairagipatteda, Tirupati Town & District.
Whereas the petitioner has filed a petition in the above matter. If you have got any objection, you may appear before this court at 10:30 a.m. on 17-11-2025, either in person or through an advocate, and file your objection. If you fail to do so, the matter will be decided ex parte.
M.Ravi Kumar,
Advocate, Tirupati

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) TIRUPATHI
I.A. No.713 of 2025
O.S. No. 33 of 2017
Puttur Murali Vasu @ Vasu
...**Petitioner/Plaintiff**
Vs.
1. P. Kesavachari & 22 others
...**Respondents**
To: Respondent Nos. 21 to 23/Proposed Parties/D-21 to D-23:
1. A. Prasanna, W/o. Late A. Bhaskar Naidu, (Proposed party)
2. A. Saranya, D/o. Late A. Bhaskar Naidu, (Proposed party)
3. A. Thanuja, D/o Late A. Bhaskar Naidu, (Proposed party)
All are residing at D.No. 19-12-197RC3, Bairagipatteda, Tirupati Town & District.
Whereas the petitioner has filed a petition in the above matter. If you have got any objection, you may appear before this court at 10:30 a.m. on 17-11-2025, either in person or through an advocate, and file your objection. If you fail to do so, the matter will be decided ex parte.
M.Ravi Kumar,
Advocate, Tirupati

IN THE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) TIRUPATHI
I.A. No.714 of 2025
O.S. No. 33 of 2017
Puttur Murali Vasu @ Vasu
...**Petitioner/Plaintiff**
Vs.
1. P. Kesavachari & 22 others
...**Respondents**
To: Respondent Nos. 21 to 23/Proposed Parties/D-21 to D-23:
1. A. Prasanna, W/o. Late A. Bhaskar Naidu, (Proposed party)
2. A. Saranya, D/o Late A. Bhaskar Naidu, (Proposed party)
3. A. Thanuja, D/oLate A. Bhaskar Naidu, (Proposed party)
All are residing at D.No. 19-12-197RC3, Bairagipatteda, Tirupati Town & District.
Whereas the petitioner has filed a petition in the above matter. If you have got any objection, you may appear before this court at 10:30 a.m. on 17-11-2025, either in person or through an advocate, and file your objection. If you fail to do so, the matter will be decided ex parte.
M.Ravi Kumar,
Advocate, Tirupati

సచివాలయం తనిఖీ



ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఎం సాయి ప్రసాద్, తాసిల్దార్ సయ్యద్ ఇక్బాల్లు తిరుమూరు సచివాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా సచివాలయంలో ఉన్న పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వర్క్ ఫ్రం హోం (కౌశలం) సర్వే స్థితిని తెలుసుకున్నారు. త్వరితగతిన సర్వే ని పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని తెలిపారు. ఈ తనిఖీల్లో పంచాయతీ కార్యదర్శి హుస్సేన్ భాష, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్వాలిటీ కంట్రోల్ పర్యవేక్షణ



ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండల పరిధిలోని దగరాజుపట్టు రోడ్డు పక్కన సిద్ధి గుంట పాలెం గ్రామానికి సమీపాన ఇంటి నివేశ స్థలాల కోసం సమీకరించిన ప్రభుత్వ స్థలంలో లెవలింగ్ పనులు రెండేళ్ల క్రితం జరిగాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ మట్టిలెవలింగ్ పనులను సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సురేష్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. రోడ్డు నిర్మాణ పనులు, లెవలింగ్ పనులను సీనియర్ క్వాలిటీకంట్రోల్ అధికారి పర్యవేక్షణలో కొలతలు తీశారు. ఈ పనులను మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు ద్వారా జరిగాయి. రెండేళ్ల క్రితం పనులు చేపట్టిన పూర్తిస్థాయిలో బిల్లులు మంజూరు కాలేదని తెలిసింది. బిల్లులు మంజూరు కొరకు పనులు చేసిన నిర్వాహకుడు న్యాయస్థానం ఆశ్రయించిన నేపథ్యంలో నేడు తాజాగా క్వాలిటీ కంట్రోల్ తనిఖీలు జరగడం విశేషం.

లెర్నింగ్ మెటీరియల్స్ అందజేత



ప్రజాశక్తి -ఏర్పేడు : పిల్లలో అభ్యాసోత్సాహాన్ని పెంపొందించడం, విద్యా నాణ్యతను మెరుగుపరచడం లక్ష్యంగా ఏర్పేడు మండలంలోని పల్లం ప్రాథమిక పాఠశాలకు రూ.10,000 విలువైన లెర్నింగ్ మెటీరియల్స్‌ను ఎస్.ఓ.ఎస్. విలేజ్ ఆధ్వర్యంలో అందజేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రజియా మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాసానికి ఈ లెర్నింగ్ మెటీరియల్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ఇలాంటి సహాయాలు గ్రామీణ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రోత్సాహం కల్పిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రజియా, ఎస్.ఓ.ఎస్. సహోపాధ్యాయులు మునిరత్నం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు దేవస్థాన కమిటీ ప్రమాణస్వీకారం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : బుధవారం గూడూరు, రాజా వీధి, శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్, నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని దేవస్థాన చైర్మన్ శ్రీ కంటి రామ్మోహనరావు కోరారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు పేపల్ల అమరయ్య నాయుడు, మంగళపూరి గోపాల్, కొమ్ము రవీంద్రబాబు, జి.మునీంద్ర బాబు, జి.మణి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బేటీ బచావో బేటీ పడావో ర్యాలీ



ప్రజాశక్తి - రామచంద్రాపురం: మండలంలోని సి రామాపురం గ్రామంలో మిషన్ శక్తి - సంబల్ కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భేటీ బచావో... బేటి పడావో కార్యక్రమం చేపట్టారు. మంగళవారం లోకమాతాపురం, అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కే మనీలా ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల బాలికలకు, పిల్లల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిషేధంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో, పాఠశాల ఉపాధ్యాయులు హరిబాబు అంగన్వాడీ కార్యకర్త పి రూప బాల బాలికలు పాల్గొన్నారు.

గిరిజనుల కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపు



ప్రజాశక్తి - బాలాయపల్లి: మండలంలోని పెరిమిడి గ్రామంలోని గిరిజనుల కోసం మంగళవారం ప్రత్యేక ఆధార్ క్యాంపు నిర్వహించారు. ఎంపీడీఓ నారాయణ క్యాంపును పరిశీలించి పలు సూచనలు చేశారు. 24 మంది ఈ క్యాంపును సద్వినియోగం చేసుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి అర్మగం తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ శాంతి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జెవివి ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: జన విజ్ఞాన వేదిక సూళ్లూరుపేట ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ బాలికల సైన్స్ టాలెంట్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి



సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. తడ, దొరవారిసత్రం, సూళ్లూరుపేట మండలాల నుండి 50 పాఠశాలలు పాల్గొన్నారు. ప్రతి మండలం నుండి ప్రభుత్వ పాఠశాల నుండి ఒక టీం, ప్రైవేట్ పాఠశాల నుంచి ఒక టీం, నవంబర్ 23న తిరుపతిలో జరిగే జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టుకు ఎంపిక చేశారు. సూళ్లూరుపేట నుండి నారాయణ ఇంగ్లీష్ మీడియంస్కూల్, స్పేస్ సెంటర్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళంపాడు, తడ నుండి పద్మావతి విద్యాలయ, తడ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, దొరవారి సత్రం నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శ్రీధనమల్లి, ఏపీ మోడల్ స్కూల్ మావిళ్ళపాడు విద్యార్థులు ఎంపికయ్యారు. విజేతలకు సూళ్లూరుపేట మండల విద్యాశాఖ అధికారిణి కె.ఎం.ఎస్.సునీలా చేతుల మీదుగా బహుమతులందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎన్.వెంకటరమణ, రాష్ట్ర బాధ్యులు చెంగయ్య, సూళ్లూరుపేట అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.రాజేష్ బాబు, ఎన్.రామమూర్తి, పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు బాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలుకి



8,9,10 వ తరగతి విద్యార్థులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ పోటీ పరీక్షలకు హాజరయ్యారు. నెలవాయి, బుచ్చినాయుడు కండ్రిగ హైస్కూల్ విద్యార్థులు, విద్యాస్ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఎస్వీఆర్ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యాస్ వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు, నిఖిలేష్, గౌతమ్, గురుసాయి, నెలవాయి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు హిమజ, హిందుజ, దేవ విజేతలుగా నిలిచారు. వీరు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు చెంగయ్య పేర్కొన్నారు. అనంతరం విజేతలకు యంఈవో ముని సుబ్రమణ్యం చేతులమీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య, ఉపాధ్యాయులు షర్మిల, రత్నమ్మ, జోషఫ్, జన విజ్ఞాన వేదిక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి



మండల స్థాయి పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో తిరుమల రాజు బహుమతులు ప్రధానం చేశారు. ప్రభుత్వ పాఠశాల నుండి జిల్లా పరిషత్ బాలిక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ముబాశిర, శ్రీలక్ష్మి, అభిమన్యు, ప్రైవేటు పాఠశాలల్లో వేదవ్యాస విద్యానికేతన్ నుండి మహేష్, సాయి, సాత్విక్, ఋషి, సాయి సాత్విక్, ప్రథమ స్థానాన్ని పొందారు. వీరు జిల్లా స్థాయిలో జరిగే చెకుముకి పోటీలకు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నిర్వాహకులు విజయ నాగు, నరేంద్ర, సైన్స్, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యం.ఈ.ఓ. కాంచన బాలకృష్ణం రాజు విచ్చేశారు. ఈ



కార్యక్రమంలో జే.వి.వి అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచు నారాయణ, రామమోహన్, పురుషోత్తమరావు, సుమన్ రెడ్డి, అరుణ్ కుమార్, శ్రీనివాసాచారి, కల్పన, నాగేశ్వరరావు , సుబ్రహ్మణ్యం వివిధ ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పాకాల: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాకాలలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలకు ముఖ్య అతిథిగా పాకాల డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్ కుమార్ పాల్గొన్నారు. విజేతలకు ఆయన బహుమతులు అందజేసినట్లు జనవిజ్ఞాన వేదిక మండల శాఖ అధ్యక్షులు వనపర్తి వెంకట సిద్దులు తెలిపారు. ఈ పోటీలకు మండలంలోని 5 ప్రభుత్వ మరియు 4 ప్రైవేట్ పాఠశాల నుండి మొత్తం 13 టీములు పాల్గొనగా ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పాకాల విద్యార్థులు అక్షయ్, ముహమ్మద్ తౌఫీక్, రిషిధర్ రెడ్డి మొదటి స్థానం, మొగరాల ఉన్నత పాఠశాల విద్యార్థులు హస్మిత, పవన్, కరిమున్నిష రెండవ స్థానంలో నిలిచారు. ఆంగ్ల మాధ్యమ పాఠశాలల నుండి విజయ ఆంగ్ల మాధ్యమ పాఠశాల, దామలచెరువు విద్యార్థులు జునైద్ అహ్మద్, చాందిని, అభినవ్ మొదటి స్థానంలో నిలిచారు. ఇన్ఫాంట్ జీసస్ ఆంగ్ల మాధ్యమ పాఠశాల, పాకాల విద్యార్థులు సంజన, జయశ్రీ, కార్తి విష్ణు రెండవ స్థానంలో నిలిచారు. విజేతలకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. మొదటి స్థానం సాధించిన ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల నుండి ఒక్కో టీమును ఈ నెల 23 వ తేదీన తిరుపతిలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరిగింది.

ప్రజాశక్తి - నాయుడుపేట: చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ ఎగ్జామును నాయుడుపేట, ఓజిలి,పెళ్లకూరు మూడు మండలాల్లో మంగళవారం నిర్వహించారు. మండల స్థాయి చెకుముకి టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి మండల కేంద్రాలలో జరిగింది. ఈ టాలెంట్ టెస్ట్‌కు మూడు



మండలాలకు కలిపి 33 స్కూల్స్‌ని ఎంపికచేశారు. ఉపాధ్యాయులు మండల వారిగా స్కూళ్ల వివరాలు తెలియచేశారు. పెళ్ళకూరు మండలంలో 8 పాఠశాలలు పాల్గొన్నాయి. పెళ్ళకూరు మండలం నుంచి జిల్లా కు ఎంపికైనటువంటి పాఠశాలల వివరాలు: 1) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాళ్లవాయపాడు 2) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల శిరసనంబేడు మరో ఆరు పాఠశాలలో ఎంపికయ్యాయి పరీక్ష కేంద్రం :-పెళ్లకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల. నాయుడుపేట మండలంలో హాజరైన ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు మొత్తం 17. నాయుడుపేట మండలం నుంచి జిల్లాకు ఎంపికైనటువంటి పాఠశాలల వివరాలు:

1) డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం పుదూరు 2) విజన్ హై స్కూల్ ఇలా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో మొత్తం 17 పాల్గొన్నాయి. నాయుడుపేట ఎల్. ఏ.సాగరం లోని ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను పరీక్షా కేంద్రంగా ఏర్పాటు చేశారు. ఓజిలి మండలంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ కు హాజరైన ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు మొత్తం 8 ఓజిలి మండలం నుంచి జిల్లాకు ఎంపికైనటువంటి పాఠశాలల వివరాలు 1) డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం చిల్లమానుచేను 2) హరి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కురుగొండ ఓజిలి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహించారు.పై కార్యక్రమం నందు పెళ్ళకూరు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు, నాయుడుపేట ఎల్ ఏ సాగరం,ప్రధానోపాధ్యాయురాలు,ఓజిలి ప్రధానోపాధ్యాయురాలు. పాఠశాల సిబ్బంది పాల్గొని బహుమతి ప్రధానం చేశారు. పై కార్యక్రమాన్ని జనవిజ్ఞాన వేదిక నాయకులు నిర్వహించారు.

ప్రజాశక్తి - రేణిగుంట : మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ పోటీలు రేణిగుంట బాలికల పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి రంగనాథం, ప్రధానో పాధ్యాయిని శ్యామల, జయలక్ష్మి, మోహన్ ఉపాధ్యాయులు విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు, ప్రతిభా పత్రాలు ప్రధాన చేశారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక కృషిని అభినందించారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని పెంచు కోవాలని తెలిపారు. శాస్త్రీయ అలోచనలు పెంచుకోవాలని తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలలో మొదటి స్థానంలో రేణిగుంట బాలుర పాఠశాల, రెండవ స్థానంలో అత్తూరు పాఠశాల బృందం, మూడవ స్థానంలో రేణిగుంట బాలికల పాఠశాల, కరకంబాడీ పాఠశాల బృందాలు నిలిచాయి. ప్రవేటు పాఠశాలల్లో అమరరాజా, రైన్బో, లక్ష్మిప్రసన్న పాఠశాలలు వరుసగా 1,2,3 స్థానాలు దక్కించుకున్నాయి. జన విజ్ఞాన వేదిక నాయకుడు ఓ వెంకట రమణ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో మొదటి స్థానం వచ్చిన విద్యార్థులను ఈనెల 23న తిరుపతిలో జిల్లా స్థాయిలో పోటీకి ఎంపికయ్యారని తెలిపారు.

ప్రతి ఒక్కరు స్వచ్ఛతకు కృషి చేయాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రతి ఒక్కరు స్వచ్ఛతకు కృషిచేయాలని గూడూరు పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.గూడూరు పురపాలక సంఘ కౌన్సిల్ హాల్ నందు పురపాలక సంఘం సిబ్బంది , పురపాలక సంఘ వార్డు శానిటేషన్ , ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు, ఎమినిటీస్ సెక్రటరీలు సానిటరీ మేస్త్రీలకు ఒకరోజు సామర్థ్యాల పెంపు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ వారిచే నియమించబడిన నాలెడ్జ్ పార్ట్నర్స్ అయినా ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ వారిచే నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఘన వ్యర్థాల నిర్వహణ పురపాలక సంఘం నందు ఎంతో కీలకమైనదని వీటి గురించి క్షుణ్ణంగా తెలుసుకుని ఆచరిస్తే చెత్త నుండి సంపద పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరు నిబద్ధతతో అభ్యసించాలని కోరారు. స్వచ్ఛ ఆంధ్రా ,స్వచ్ఛ గూడూరుగా తీర్చిదిద్దాలంటే అందరూ చెత్తను వేరుచేసి మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది వచ్చినప్పుడు వారికి అందించాలని స్వచ్ఛత విషయంలో అందరూ బాధ్యత వహిస్తే స్వచ్ఛ గూడూరుగా తీర్చవచ్చు అని అన్నారు. ఈ వన్డే ట్రైనింగ్ ప్రోగ్రాం సందర్భంగా వార్డ్ లెవెల్ ఆఫీసర్స్ కు ఘన వ్యర్థాల నిర్వహణ తడి పొడి హానికర ప్లాస్టిక్ వేస్ట్ , ఈ వేస్ట్ నిర్వహణ గురించి డీటెయిల్స్ గా అవగాహన కల్పించి వార్డులో ఏ విధంగా నిర్వహించాలి అని శిక్షణ ఇవ్వడం జరిగినది. బల్క్ వేస్ట్ జనరేటర్స్ వేస్ట్ ప్రాసెసింగ్ టెక్నాలజీ ఎంఎల్డబ్ల్యు రూల్స్ 2016 తదితర విషయాల పైన శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏడబ్ల్యూఐ ఎల్ ఎస్ జి నుండి ప్రకాశం జిల్లా కోఆర్డినేటర్ కోటేశ్వర రావు తిరుపతి జిల్లా కోఆర్డినేటర్ తేజా నెల్లూరు జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు , ట్రైనీ పర్సన్ కె.శ్రీనివాస రావు, మధురియ పాల్గొన్నారు.

చిట్టేడులో వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి -కోట : చిట్టేడు పంచాయతీ లో వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ జరిగింది.ఈ కార్యక్రమానికి చిట్టేడు,ఊనుగుంట పాలెం,మద్దాలి,కేశవరం గ్రామాలు నుండి వైసీపీ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొడవలూరి ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ప్రజలు సంతోషంగా ఆరోగ్యం పట్ల విద్య పట్ల జీవించే వారిని గుర్తు చేశారు,తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ వైయస్ జగన్మోహన్ రెడ్డి విద్యా వైద్యానికి ఆయన పరిపాల పెద్దపీట వేశారన్నారు.ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వంలో వైద్యం అనేది అందని ద్రాక్ష లాగా తయారయిందన్నారు.ప్రైవేటు పరం చేయడం అనేది స్వార్థపూరిత లాభా దాయకరమైనటువంటి వ్యాపారం లాంటిదన్నారు.అదేవిధంగా ఎమ్మెల్సీ మేరుగ మురళి మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు వైద్యం విషయంలో ప్రభుత్వ కళాశాలలను పి 4 విధానంతో ప్రవేట్ పరం చేస్తున్నారు అని అన్నారు.జగన్మోహన్ రెడ్డి ప్రతి జిల్లాలో ప్రభుత్వ కళాశాల ఉండాలి అని, తద్వారా వైద్యశాల ద్వారా మంచి వైద్యం,ఉద్యోగాలు కల్పించాలని సంకల్పించి తీసుకువస్తే,దానికి తూట్లుపొడుస్తూ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్న సందర్భంగా,ఎదుర్కొనేందుకే ఇంకోటి సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని తెలియజేశారు. జరుగుతున్న దాడులను తిప్పికొట్టేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ అనే యాప్ ద్వారా నమోదు చేసి కఠినంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మేరిగ మురళి,రాష్ట్ర కార్యదర్శి పడవలూరు ధనుంజయ రెడ్డి తో పాటు ఎంపీపీ దాసరి అంజమ్మ,జడ్పిటిసి దాసరి కోటయ్య,వైసీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్ రెడ్డి,పరంధాం రెడ్డి,దేవా రెడ్డి నాగూర్ రెడ్డి,సిద్ధవరం సొసైటీ మాజీ చైర్మన్ సన్నా రెడ్డి రాఘవ రెడ్డి,నేదురుమల్లి హరీష్ చంద్రా రెడ్డి,చంద్రమోహన్ రెడ్డి,పుట్టా నారాయణ,ఈగ రఘు రామయ్య, శివరామ నాయుడు,కోటారెడ్డి, నాగూర్ యాదవ్, వైఎస్ఆర్సిపి స్టేట్ బీసీ సెల్ సెక్రెటరీ మంగమూరు సుబ్రహ్మణ్యం,ఎస్సీ సెల్ పాముల సురేంద్ర, కోట మండలం మైనారిటీ సెల్ ఎస్.కె రేష్మ,కేశవరం పంచాయతీ గోనుపల్లి.మస్తాన్, ఉలసా.కస్తూరయ్య యాదవ్, కర్లపూడి బుజ్జయ్య,కనుపూరు జగదీష్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,ప్రజలు పాల్గొన్నారు.

బాలాజీ నగర్‌లోనే నివాసం కల్పించాలి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుమలలోని ఆర్బిసి సెంటర్‌లో నివసిస్తున్న వారికి బాలాజీ నగర్‌లో నివాసం కల్పించాలని టిటిడి ఈఓ ఏకే సింఘాల్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కోరారు. టిటిడి అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌లో ఈఓ అనీల్ కుమార్ సింఘాల్‌తో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సమావేశమయ్యారు. వివిధ అంశాలపై ఆయనతో చర్చించారు. తిరుమల, ఆర్బిసి సెంటర్‌లో నివసిస్తున్న 84 మందిని తిరుపతికి తరలించాలని చేస్తున్న ప్రయత్నాన్ని మానుకుని బాలాజీనగర్‌లో నివాసం కల్పించాలని ఈఓను ఎమ్మెల్యే కోరారు. అలాగే శ్రీ వెంకటేశ్వర నాట్య కళాపరిషత్ రెన్యువల్ చేయడంతో పాటు ఏటా నాటకాల ప్రదర్శనకి కేటాయించే మొత్తాన్ని విడుదల చేయాలని కోరారు. శ్రీ వకుళమాత అన్నదాన ట్రస్టులో పనిచేస్తున్న కార్మికులకు టైమ్ స్కేల్, లడ్డు కార్డు, శ్రీవారి దర్శనం కల్పించాలని కోరారు. ఈ అంశాలను సానుకూలంగా పరిశీలిస్తామని ఈఓ తెలిపారు.

దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నక్కల గురవయ్య



ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం ముసలిపేడు దళిత వాడకి చెందిన నక్కల గురవయ్య దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన్ను దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు కృష్ణ స్వరూప్ ఆదేశాలతో రాష్ట్ర కమిటీ ఎంపిక చేసింది. నక్కల గురవయ్య అంబేద్కర్ యువజన సంఘం నాయకుడిగా దళిత సంఘ నేతగా దళితుల సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేసేవాడు. ఈ క్రమంలో ఆయన సేవలను గుర్తించిన దళిత బహుజన పార్టీ ఆయనను తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. నక్కల గురవయ్య జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక కావడంతో తిరుపతి జిల్లాలోని ప్రజాసంఘాలు దళిత సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఈ సందర్భంగా నక్కల గురవయ్య మాట్లాడుతూ దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసిన జాతీయ రాష్ట్రస్థాయి నాయకులు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తిరుపతి జిల్లాలో నిరంతరం దళితల సమస్యల పట్ల పోరాటం చేస్తానని పేర్కొన్నారు.

గిరిజనులకు ఆధార్ నమోదు

ప్రజాశక్తి - రేణిగుంట : మండలంలోని గిరిజనుల డోమిసైల్ సర్టిఫికెట్ల ద్వారా ఆధార్ కార్డు నమోదు చేసుకోవచ్చని రేణిగుంట తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం రేణిగుంట మండలం, ఎల్లమండ్యం ఎస్టీ కాలనీలో వీఆర్వో రామ్మూర్తి గిరిజనులకు డోవిసైల్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మండలంలో ఆధార్ కార్డు లేని గిరిజనులు ఈ సర్టిఫికెట్ల ద్వారా ఆధార్ నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ పథకాలకు, పిల్లల చదువులకు ఆధార్ కార్డు తప్పనిసరిఅని తెలిపారు.

కరుణాకర్ రెడ్డి కేఏ పాల్‌కు ఎక్కువ.. కమిడియన్‌కు తక్కువ



సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఫ్లెమింగో పక్షుల విడిది, స్థిరంగా ఉండే నివాసాల ఏర్పాటుపై జనసేన అధ్యక్షులు, రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలను మాజీ ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి పేరు కోసం వక్రీకరించారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విమర్శించారు. గతంలో ఆరు నెలలు మాత్రమే పులికాట్‌లో కనిపించే ఫ్లెమింగో పక్షులు ఇటీవల కాలంలో ఏడాది పొడవునా కనిపిస్తుండటంతో తుఫాన్ ప్రభావం నుంచి రక్షణ కల్పించేలా విడిది కేంద్రాలు, స్థిరంగా ఉండే నివాసాలు ఏర్పాటు చేసి ఎకో టూరిజాన్ని పెంపొందించాల్సి అవసరం ఉందని పవన్ కళ్యాణ్ చెప్పారని ఆయన తెలిపారు. మంగళవారం సాయంత్రం తన కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి తిరపతికి పట్టిన కరోనా కర్ రెడ్డని ఆరోపించారు. పదవి పోవడంతో నట్టు లూజై నోటి కొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. కరోనాకర్ రెడ్డి మాటలను ప్రజలు పట్టించుకోరని ఆయనను తిరుపతి జోకర్‌గా చూస్తున్నారని ఎద్దేవా చేశారు. రాజకీయాల్లో కరోనాకర్ రెడ్డి కేఏ పాల్‌కు ఎక్కువ కమిడియన్‌కు తక్కువని విమర్శించారు. పులస చేపలకు ఫ్లెమింగో పక్షులకు లింకు పెట్టడం కరోనాకర్ రెడ్డి అవివేకానికి నిదర్శనమని అన్నారు. పులస చేపలు, బాయిలర్ కోళ్ళు మటన్ దుకాణాల గురించి మాత్రమే వైసిపి పాలనలో ఆలోచించేవారని తెలిపారు. ఫిష్ ఆంధ్రాపేరుతో యువతకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన గొప్ప నాయకుడు హయాంలో వైసిపి నాయకులుకు చేపల భాష మాత్రమే తెలున్నారు. ఫ్లెమింగో పక్షులను బంధించి పులికాట్‌లో ఉంచేద్దామని పవన్ కళ్యాణ్ ఎప్పుడూ అనలేదని చెప్పారు. పర్యాటకరంగ అభివృద్ధితోపాటు ప్రకృతి ప్రేమికుల కోసం ఫ్లెమింగో పక్షుల కోసం విడిది, తుఫాన్‌లను తట్టుకునేలా నివాసాలు ఏర్పాటు చేయాలని మాత్రమే పవన్ కళ్యాణ్ చెప్పారని ఆయన తెలిపారు. చాలా పుస్తకాలు చదివానని చెప్పే కరోనాకర్ రెడ్డి మీ కళ్ళకు పత్రిక సరిగ్గా చదవడం నేర్చుకోవాలని సూచించారు. కరోనాకర్ రెడ్డి ఐడెంటి క్రైసిస్‌తో బాధపడుతూ పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడితే టీవీల్లో చూపిస్తారని ఇష్టానరీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు. 13,323 గ్రామపంచాయితీల్లో గ్రామ సభలు నిర్వహించిన ఘనత పవన్ కళ్యాణ్‌దని ఆయన చెప్పారు. సచివాలయాని కూడా రాకుండా ఇంట్లో సెట్ వేసుకుని పని చేసిన నాయకుడు పులివెందుల ఎమ్మెల్యే అని ఆరోపించారు. వైసిపి పాలనలో దోచుకున్న ప్రతి ఒక్కరు జైలుకెళ్ళుతున్నారని త్వరలోనే కరోనాకర్ రెడ్డి జైలు కెళ్ళడం ఖాయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాజా రెడ్డి, హరిశంకర్, బాజ్జీ, రాజేష్ ఆచ్చారి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో కోటి దీపోత్సవం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన రామచంద్ర పుష్కరిణి వేదికగా కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తిరుపతి ఫిలిం సొసైటీ కార్యదర్శి శేషగిరిరావు తెలిపారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో సొసైటీ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. తిరుపతి ఫిలిమ్స్ సొసైటీ 357వ కార్యక్రమంలో ఈ కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, అధ్యక్షులు వైయస్ బాబు, కోశాధికారి ప్రసాదరావు, చంద్రన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం నాకు ఆదర్శం : మధుబాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను చూసి పేద వర్గాలకు సహాయం, సేవా కార్యక్రమాలను చేయడం అలవాటుగా మార్చుకున్నారని జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు బత్తెన మధుబాబు తెలిపారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన పుట్టినరోజు సందర్భంగా నగరపాలక సంస్థ కార్మికులు నివాసం ఉండే స్కావెంజర్స్ కాలనీ ప్రజలను ప్రముఖ 3 స్టార్ హోటల్ కు తీసుకెళ్లి భోజనం ఏర్పాట్లు చేయడమే కాకుండా, అక్కడ నివాసం ఉంటూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు దృష్టికి తీసుకురావడం, వాటికి పరిష్కారం మార్గాలపై తగిన నిర్ణయాలు ఎమ్మెల్యే తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హస్తకళ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, జనసేన పార్టీ నాయకులు హాజరవుతారన్నారు.

నష్టపరిహారం చెల్లించండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎంఆర్ పల్లి ప్రాంతం తుమ్మలగుంటకు పోవు మార్గంలో రాజేశ్వరరావు అనే వ్యక్తి నుండి స్థలం బాడుగకు తీసుకుని చిన్నపాటి హ్యాండ్లూమ్ సెంటర్ ఏర్పాటు చేసుకున్నానని, ఇప్పుడు వారు తన పలుకుబడితో కొంతమందిని తీసుకువచ్చి ఖరీదైన మిషనరీలను, లక్షలు విలువ చేసే పట్టు చీరలను తీసుకెళ్లిపోయారని, వీటన్నింటికీ నష్టపరిహారం చెల్లించాలని యశోద అనే మహిళ వాపోయారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దీనిపై పలుమార్లు ఇప్పటికే జిల్లా ఎస్పీకు ఫిర్యాదు చేశామన్నారు.

మా భూమిని మాకు అప్పగించండి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తాను కొనుగోలు చేసిన భూమిలో అద్దె ప్రతిపాదికన చేరిన యశోద అనే మహిళ, తన భూమిని కబ్జా చేయడానికి కుట్ర చేసిందని, ఆమె నుండి భూమిని కాపాడి తనకు అప్పగించాలని రిటైర్డ్ ప్రొఫెసర్ రాజేశ్వరరావు జిల్లా ఉన్నతాధికారులను కోరారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లీజు అగ్రిమెంట్ ముగిసిన స్థలం ఖాళీ చేయకుండా, ఇబ్బందులకు గురి చేస్తోందని, ఆమె ఆగడాలకు అండగా ఎంఆర్ పల్లి సిఐ చిన్నగోవిందు ఉంటూ తమపై కేసులు బనాయించడం దారుణం అన్నారు. యశోద వ్యాపార అభివృద్ధి కోసం తమ వద్ద నుండి ఆరు లక్షల రూపాయలు నగదు తీసుకుందని, అద్దెలు చెల్లించలేదని, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, సబ్ కలెక్టర్ కార్యాలయంలో గూడూరు పట్టణ, రూరల్ పరిధిలోని ఖాళీగా ఉన్న రెండు అంగన్వాడీ కార్యకర్త పోస్టులు, నాలుగు ఆయాలు పోస్టులకు ఎఫ్.ఏ.సి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, గూడూరు, వెంకటగిరి సి.డి.పి.వోల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 23 మంది దరఖాస్తు చేసుకుని 21 మంది హాజరయ్యారని గూడూరు సి.డి.పి.వో మెహబూబి పేర్కొన్నారు.

అమ్మవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జెఈవో సమీక్ష



తిరుచానూరు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అధికారులతో సమీక్షిస్తున్న టిటిడి జెఈవో వీరబ్రహ్మం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల (నవంబర్ 17 నుండి 25వ తేదీ) ఏర్పాట్లపై తిరుచానూరు ఆస్థాన మండపంలో మంగళవారం టీటీడీ జేఈవో వీరబ్రహ్మం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై ఆయన తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు, టిటిడి సీవీఎస్వో మురళీకృష్ణలతో కలిసి క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జేఈవో మీడియాతో మాట్లాడుతూ తిరుచానూరులో శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. గత సంవత్సరం కంటే ఈసారి భక్తులకు ఇంకా మెరుగైన విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలియజేశారు. తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ పంచమీ తీర్థం రోజు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో తిరుచానూరుకు వచ్చే రోడ్లపై హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా పగడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. టీటీడీ సీవీఎస్వో కే.వి. మురళీకృష్ణ మాట్లాడుతూ హోల్డింగ్ ఏరియాస్, వాహన మార్గాలు, పుష్కరిణి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తున్నామన్నారు. టీటీడీ చైర్మన్, ఈవోలు ఇచ్చిన సూచనల మేరకు బ్రహ్మోత్సవాలు మరింత ఘనంగా జరగే విధంగా ప్రత్యేక భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు.

రైతులకు యూరియా పంపిణీ



ఏఎంసి ఛైర్మన్ మర్రి ప్రమీల చేతుల మీదుగా యూరియా పంపిణీ

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని కొత్తపాలెం పిఏసిఎస్‌లలో ఏఎంసి ఛైర్మన్ మర్రి ప్రమీల చేతుల మీదుగా రైతులకు యూరియా పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా వాకాడు ఏ ఎమ్ సీ ఛైర్మన్ మర్రి.ప్రమీల మాట్లాడుతూ మండలంలోని ప్రైవేట్ డీలర్స్, సొసైటీ,రైతు సేవ కేంద్రాలలో యూరియా నిల్వలు ఉన్నాయని, ఈ రబీ సీజన్ కు రైతులు ఎటువంటి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ రవీంద్ర రెడ్డి,సొసైటీ సీఈఓ గోపి,టీడీపీ సీనియర్ నాయకులు నెల్లూరు మోహన్ రెడ్డి,ఎంపీటీసీ నారాయణ,కోట ఎంపీటీసీ దారా.సురేష్ ,మండల వ్యవసాయ అధికారి సుచేంద్ర ప్రసాద్,శ్రీ భూషణ్,రైతులు పాల్గొన్నారు.